# యూదయలో

# నిద్రలేమి

## చదువుటకు నియమించినవి #36

VII. ప్రభువు పరిచర్యలో చివరి వారం (కొనసాగింది).

H. శుక్రవారం : యేసు మరణ దినం (కొనసాగింది).

2. గెత్సేమనే తోట (మత్తయి 26:30, 36–46; మార్కు 14:26, 32–42; లూకా 22:39–46; యోహాను 18:1).
3. అప్పగింత, బంధింపబడుట (మత్తయి 26:47–56; మార్కు 14:43–52; లూకా 22:47–53; యోహాను 18:2–11).
4. యూదులచే "తీర్పు" (ఒకటి, రెండు అంచెలు).
   - ఎ. మొదటి అంచె: అన్నచే విచారింపబడుట (యోహాను 18:12–14, 19–23).
   - బి. రెండవ అంచె: కయపయు, మహాసభయు ఆయనను నేరస్థుడని తీర్పు తీర్చడం జరిగింది (మత్తయి 26:57, 59–68; మార్కు 14:53, 55–65; లూకా 22:54, 63–65; యోహాను 18:24).

## పరిచయం

నీవెప్పుడైనా నిద్రలేని రాత్రి గడిపావా? ఒకవేళ నీవు భయము, ఆందోళన లేక బాధతో నిండియుండవచ్చు. నాకు కొన్ని నిద్రలేని రాత్రులు గడిచాయి – నీకు కూడా గడిచియుండవచ్చు. ఆయన మరణానికి ముందు, క్రీస్తువారు నిద్రలేని రాత్రిగడిపారు. ఆయన శిష్యులు ఒకటి రెండు గంటలు నిద్రపోయి ఉండవచ్చు (మత్తయి 26:40), అయితే ఆయనకు మాత్రం నిద్రలేదు. ఆ రాత్రిలో మొదటి ఝాములోని, ప్రభువువారి ఆలోచనలు నిద్రకు అనుకూలమైనవి కావు: ఆ రాత్రిలోని రెండవ ఝాములో ఆయన శత్రువులు ఆయనను నిద్రపోనియ్యలేదు.

మన గత పాఠం, యోహాను 14–17ల మీద. ఈ అధ్యాయాలలో ప్రతి భాగము ఏ స్థలంలో చర్చించారో మనకు ఖచ్చితంగా తెలియదు. "లెండి, యిక్కడ నుండి వెళ్లుదము" అని ఆయన తన అపొస్తలులతో అన్నట్టు యోహాను 14:31లో ఉంది. ఆ సమయములో ఆయనయు ఆయన అపొస్తలులును మేడగదిని విడిచినట్టు సూచిస్తుంది. 15, 16 మరియు 17, వారు గెత్సేమనేకు వెళ్లుతుండగా మాట్లాడియుండవచ్చు.[1] మరోవైపు, "వెళ్లుదములెండి" అని ఆయన అన్న తరువాత వారు కొంచెం సేపు అక్కడే

సముదాయిస్తు ఉండి యుండవచ్చు ("మేము వెళ్లాలి" అంటూ కదలకుండా ఒక గంటసేపు ఉండిపోయే అతిథులతో మాకు అనుభవం ఉంది) ఏదియెలాగున్నా, ఒకానొక సమయంలో, క్రీస్తును, అతని పదకొండుమంది శిష్యులును మేడగదిని విడిచి గెత్సేమనే తొటవైపు పయనం సాగించారు (మత్తయి 26:30, 36).[2]

ప్రభువువారి చర్చ ముగిసింది. ఇక్కడ నుండి సువార్త లేఖికులు ఐతిహాసిక విషయాలపై శ్రద్ధచూపారు.[3] క్రీస్తు సిలువవేయబడకముందు చివరి గంటలనుండి మనం నేర్చుకోవలసింది ఎంతో ఉంది.

## దహించే వేదన (మత్తయి 26:30, 36-46; మార్కు 14:26, 32-42; లూకా 22:39-46; యోహాను 18:1, 2)

కీర్తన పాడడంతో మేడగదిలో ఏర్పాటైన కార్యక్రమం ముగిసిపోయింది: "అంతట వారు కీర్తన పాడి ఒలీవల కొండకు వెళ్లిరి" (మత్తయి 26:30; మార్కు 14:26 చూడు). పారంపర్యంగా, పస్కా భోజనం "స్తుతి[4] గీతములు (కీర్తనలు 115–118) పాడడంతో ముగించబడుతుంది."[5] స్తుతి గీతములను ప్రేరేపించిన దేవత్వంలో క్రీస్తు ప్రభువు భాగమైయున్నందున (2 పేతురు 1:21), కీర్తన రచయిత తన సొంత రచనను పాడినట్టయ్యింది. క్రీస్తువారును, ఆయన అపొస్తలులును తమ స్వరాలను ఎత్తి దేవునికి స్తుతిగానము చేయడం నీ మనోదృష్టితో చూడు; వారి స్వరములను మేళవించి చేస్తున్న గానాన్ని విను. వారు పాడిన గీతము చివరి స్తుతి గీతమైయుండవచ్చు: "యెహోవా దయాళుడు ఆయన కృప నిరంతరము నిలుచును ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి" (కీర్తనలు 118:1). "క్రీస్తులోని ప్రశంసా స్ఫూర్తిని సిలువ నీడ అణచలేక పోయింది.."[6]

ప్రభువు తన అపొస్తలులతో కూడ, యిరుకైన వీధులగుండా, పట్టణపు గవునుల గుండా, కెద్రోను లోయను దాటి,[7] ఒలీవలకొండ చరియల మీదికి నడిచిపోయారు (యోహాను 18:1; లూకా 22:39). అంతట క్రీస్తు వారితో కూడ "గెత్సేమనే" అనబడిన చోటికి వచ్చారు[8] (మత్తయి 26:36; మార్కు 14:32 చూడు). "అక్కడ ఒక తోటయుండెను, దానిలోనికి ఆయన … తన శిష్యులతో పలుమారు … వెళ్లుచుండువాడు" (యోహాను 18:1, 2; లూకా 21:37 చూడు). గెత్సేమనే అనే చోటు బంగారు గుమ్మానికి నేరుగా తూర్పుదిశలో అరమైలు దూరముంటుంది. డెబ్బది గజాల చదరంలో సుమారు డెబ్బది అయిదు ఒలీవచెట్లుగలిగి గోడల మధ్యనుండే తోట.[9] "గెత్సేమనే" అనేది గ్రీకురూపం (హెబ్రీ లేక అరామీ భాషనుండి సేకరించబడింది. దానికి ("oil-press") నూనె తీయు అని అర్థం). అక్కడ ఒలీవల నూనె తీసే ఏర్పాటును బట్టి, దానికి ఆ పేరు వచ్చి ఉంటుంది.

తన శిష్యులలో (మత్తయి 26:36) ఎనిమిది మందిని ఒకచోట వదిలివేసి, "–మీరు శోధనలో ప్రవేశించ కుండునట్లు ప్రార్థన చేయుడని చెప్పి" (లూకా 22:40), పేతురును జెబెదయ యిద్దరు కుమారులను వెంటబెట్టుకొని పోయి (మత్తయి 26:37ఎ;

మార్కు 14;33ఎ), యింకను ఆయన ముందుకు వెళ్లారు.[10] తన ఎదుటనున్న భౌతికమును, ఆత్మసంబంధమునైన వేదనచే మునిగినవారై, "మిగుల విభ్రాంతి నొందుటకును చింతాక్రాంతుడగుటకును ఆరంభించెను" (మార్కు 14:33బి). "మరణమగునంతగా నా ప్రాణము బహు దుఃఖములో మునిగియున్నది; మీరు ఇక్కడ నిలిచి, నాతోకూడ మెలకువగా నుండుడని" తన ముగ్గురు స్నేహితులతో అన్నారు (మత్తయి 26:38).

ఆ తోటలో యింకను కొంత దూరము వెళ్లి. "సాగిలపడి[11] – నా తండ్రీ, సాధ్యమైతే ఈ గిన్నె నా యొద్దనుండి తొలగిపోనిమ్ము ..." అని ప్రార్థించారు (మత్తయి 26:39ఎ; మార్కు 14:35, 36; లూకా 22:42లను చూడు). "ఈ గిన్నె"[12] అనే ప్రయోగం, ఆయన మరణము, ఆ మరణానికి సంబంధించిదంతా. "అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్తప్రకారమే కానిమ్మని ప్రార్థించెను" (మత్తయి 26:39బి).

ఆయన పేతురు, యాకోబు, యోహానుల యొద్దకు తిరిగివచ్చి, వారు నిద్రించుతున్నట్టు కనుగొన్నారు (మత్తయి 26:40). "–సీమోను, నీవు నిద్రించుచున్నావా? ఒక్క గడియయైనను మేలుకొనియుండలేవా?" అని అడిగినప్పుడు, ఆయన నిరాశతో మాట్లాడియుంటారా? (మార్కు 14:37బి).

ఆయన మరల రెండవమారు వెళ్లి: "నా తండ్రీ, నేను దీనిని త్రాగితేనేగాని యిది నాయొద్ద నుండి తొలగిపోవుట సాధ్యము కానియెడల, నీ చిత్తమే సిద్ధించును గాక అని ప్రార్థించెను" (మత్తయి 26:42). ఆయన లేచి తిరిగి తన ముగ్గురు శిష్యుల యొద్దకు వెళ్లి – వారు నిద్రపోవుట కనుగొన్నారు (మత్తయి 26:43). ఎందుకు మెలకువగా లేరని ఆయన వారినడిగినప్పుడు,[13] "ఆయనకేమి ఉత్తరమియ్యవలెనో వారికి తోచలేదు" (మార్కు 14:40బి). మెలకువగా ఉండలేనందుకు వారు సంకటంలో పడియున్నారు, ఎలాగు క్షమాపణ చెప్పుకోవాలో కూడ వారికి తెలియలేదు. "ఏలయనగా వారి కన్నులు భారముగా ఉండెను" (మార్కు 14:40ఎ). "వారు దుఃఖముచేత నిద్రించు"[14] చుండినట్టు లూకా వివరించాడు (లూకా 22:45వ.).

నీవు ఈ దృశ్యాన్ని నీ మనస్సులో చిత్రించుకొన్నప్పుడు, క్రీస్తు వారిని విడిచినవెంటనే పడి నిద్రపోయినట్టు తలంచ పనిలేదు. కాని, పేతురు, యాకోబు, యోహానులు నిద్రతో పోరాడుతున్నారు. అయితే వారు ఓడిపోతున్నారు, వారి కన్నులు బరువెక్కి నేలమీద వారిని నిద్రకు పడవేసాయి . అవును, వారు మెలకువగా ఉండవలసిందే, కాని భౌతికంగా గాను, ఉద్వేగంగా గాను వారు అలసిపోయారు.

వారిని విడిచి వెళ్లి మూడవ మారు ఆయన ప్రార్థనలో కూలబడిపోయారు: "ఆయన వేదనపడి మరింత ఆతురముగా ప్రార్థన చేయగా ఆయన చెమట, నేల పడుచున్న గొప్ప రక్త బిందువులవలె ఆయెను" (లూకా 22:44). "మహా రోదనముతోను కన్నీళ్లతోను, తన్ను మరణమునుండి రక్షింపగలవానికి ప్రార్థనలను యాచనలను సమర్పించి" నట్టు హెబ్రీయుల లేఖికుడన్నాడు (హెబ్రీ. 5:7ఎ). ఆయన ప్రార్థనలకు జవాబుగా, "పరలోకమునుండి యొక దూత ఆయనకు కనబడి ఆయనను బలపరచెను" (లూకా 22:43).[15]

మూడవసారి, క్రీస్తు తన శిష్యుల యొద్దకు తిరిగి వచ్చినప్పుడు, ఆయన అంతరంగపు ఆవేదన సద్దణగింది. అప్పుడాయన, “ఇక నిద్రపోయి ఆలసట తీర్చుకొనుడి?[16] ఇదిగో, ఆ గడియ వచ్చియున్నది;[17] మనుష్యకుమారుడు పాపులచేతికి అప్పగింపబడుచున్నాడు ... ఇదిగో నన్ను అప్పగించువాడు సమీపించియున్నాడని వారితో చెప్పెను” (మత్తయి 26:45, 46).

## మృగప్రాయంగా ఖైదు చేయుట (మత్తయి 26:47-56; మార్కు 14:43-52; లూకా 22:47-53; యోహాను 18:2-11)

ప్రభువు యింకను మాటలాడుచుండగా, జనసమూహం తోటలోనికి ప్రవేశించారు – ఒకవేళ వందలాదిమంది వచ్చియుంటారేమో (మత్తయి 26:47ఎ; మార్కు 14:43ఎ; లూకా 22:47ఎ లను చూడు). హంతకులైన ఈ మూకకు యూదా నాయకుడు.[18]

ఇతర శిష్యులు నిద్రపోతూ ఉండవచ్చు, కాని యూదా నిద్రపోయినట్టులేదు. సన్‌హెడ్రిన్‌తో తన కాంట్రాక్టును నెరవేర్చడానికి, అతడు వారిని ప్రభువు ఉన్న చోటికి నడిపించాలి (అపొ. 1:16బి). ఒకవేళ ముందు అతడు మేడగదిని తనికీ చేసివచ్చి యున్నాడేమో.[19] తాను తన శిష్యులతో పాటు తరచుగా వెళ్లుతూ ఉండే ఒలీవల కొండ యూదాకు తెలియనిది కాదు. గనుక ప్రభువు శత్రువులను యూదా ఆ చోటుకు నడిపించాడు (యోహాను 18:2).

యూదాతో కూడ “బహు జనసమూహము కత్తులు గుదియలు పట్టుకొని ప్రధాన యాజకుల యొద్దనుండియు ప్రజల పెద్దల యొద్దనుండియు వచ్చెను” (మత్తయి 26:47; మార్కు 14:43) – అంటే, సన్‌హెడ్రిన్ నుండి అని అర్థం.[20] ఆ గుంపులో “దేవాలయపు అధిపతులు” కూడ ఉన్నారు (లూకా 22:52; యోహాను 18:3). వారు దేవాలయపు రక్షక భటులైయుండవచ్చు. వీరును మహాసభ (సన్‌హెడ్రిన్) అదుపులోనివారే. అందులో వింతైన విషయమేమంటే, ఆ జనసమూహంలో రోమీయుల సైనికులు కూడ ఉండియుండవచ్చు.[21] ఆయనను బంధించడంలో తమకు సహాయముగా ఉండునట్లు సన్‌హెడ్రిన్ వారు రోమా అధికారులతో సంప్రదించియుండవచ్చు.[22] “అంతట సైనికులును సహస్రాధిపతియు, యూదుల బంట్రోతులును యేసును పట్టుకొని ఆయనను బంధించి”నట్లు యోహాను తెలిపాడు (యోహాను 18:3, 12). రోమీయుల దండు సాధారణంగా ఆరువందలమంది సైనికులు ఉంటారు (దీన్ని “రోమన్ Cohort” అని అంటారు).[23] క్రీస్తును పట్టుకొనడానికి యింతమంది వచ్చియుండక పోవచ్చు; కాని, “బహు జన సమూహము” అనే మత్తయి ప్రతిపాదన యొక్క వెలుగులో (మత్తయి 26:47), వందల సంఖ్యలో సైనికులు ఉండియుండవచ్చు. వారును, జనుల మూకయు “కత్తులు గుదియలతో” వచ్చారు (యోహాను 18:3; మత్తయి 26:47, 55; మార్కు 14:43, 48; లూకా 22:52).[24]

ఒక్క మనిషిని బంధించడానికి యింతమందిని ఎందుకు పంపారు? “బంధింప శక్యము కానివాడని” ఒకవేళ వారు అధికారులకు చెప్పియుండవచ్చు (యోహాను 7:30,

44; 10:39 చూడు). అద్భుతములు చేయువాడుగా వారాయన ప్రతిభను విని యుండవచ్చు; అంజూరపు చెట్టును కేవలం ఒక్క నోటి మాటతో ఎండ గట్టినవాడని వారికి చెప్పబడియుండవచ్చు (మత్తయి 21:19). హేతువేమైయున్నా, అది మాత్రం అసంగతమైన దృశ్యమైయుంది: ఎవరికి ఎన్నడూ హానిచేయని ఒకని ఒక చెంప మీద కొట్టితే మరియొక చెంప తిప్పుడని తన శిష్యులకు బోధించిన ఒకని (మత్తయి 5:39) పట్టుకొనడానికి వందలమంది ఆయుధ ధారులు రావడం వింతయే.

జనులు యేసును గుర్తించడానికి గాను యూదా ముందుగానే వారికి ఒక గురుతును సూచించాడు: బుగ్గమీద ముద్దుతో, ఒక శిష్యుడు తన గురువునకు వందనము చేయునట్టు అతడు చేస్తాడు (మత్తయి 26:48; మార్కు 14:44). ఆలాటి వంచన జరుగనవసరం లేకుండగనే, ఆయన వారియొద్దకు వెళ్లి "మీరెవరిని వెదకుచున్నారని" వారిని అడిగెను. వారు "నజరేయుడైన యేసునని" ఉత్తరమియ్యగా యేసు "ఆయనను నేనే" అని వారితో చెప్పెను (యోహాను 18:4, 5).

ఆయన ఆ మాట చెప్పగా ఆయనను పట్టుకొనబోయే వారు "వెనుకకు తగ్గి నేలమీద పడిరి" (యోహాను 18:6). వారలా వెనుకకు పోవుట అతని దైవశక్తికి నిదర్శనమై యుండవచ్చు. ఆయన దైవికమైన ప్రసన్నతకు అది ఉలికిపడేలా చేసే ప్రతిచర్య యైయుంది.[25] "వారాయన యెదుట భీతినొంది, అవమానము పొందినవారై భద్రతలేనివారుగా నిలిచారు. ఆయన పవిత్రతయొక్క స్వేత కిరణం వారి ఆత్మలకు దోషంగా భావన పుట్టించింది ... వారాయనను చిక్కించుకొనవలెనని యుండగా, ఆయనే వారిని చిక్కించుకున్నాడు" అని G. Hall Todd రాశాడు.[26]

తమ పనిలో భంగపడిన వారికి వారి పనిని క్రీస్తు గుర్తుచేయవలసివచ్చింది. గనుక, "మరల ఆయన– మీరు ఎవనిని వెదకుచున్నారని వారిని అడిగెను." అందుకు వారు "నజరేయుడైన యేసునని" చెప్పగా యేసు వారితో "నేనే ఆయనని మీతో చెప్పితిని గనుక ... వీరిని పోనియ్యుడని (తన పదకొండు మంది శిష్యులను గూర్చి) చెప్పెను" (యోహాను 18:7–8). తన సొంత క్షేమాన్ని గూర్చి ఆయన పట్టించుకోలేదు గాని తన శిష్యుల క్షేమమును గూర్చి ఆయన అక్కర కలిగియున్నారు.

రెండు మార్లు ప్రభువు తన్నుతానే గుర్తింపజేసికొనినందున, ముందుగా యూదా ఏర్పాటు చేసికొన్న గురుతుకు విలువలేకుండ పోయింది – ఇంతకుముందు శిష్యుడైన అతడు ఆ డబ్బును సంపాదించుకోవాలనే తీర్మానంలోనే ఉండిపోయాడు. గనుక అతడు ప్రభువు చెంతకువెళ్లి "–బోధకుడా, నీకు శుభమని చెప్పి ఆయనను ముద్దుపెట్టు కొనెను" (మత్తయి 26:49). అందుకు ప్రభువు "–యూదా, నీవు ముద్దుపెట్టుకొని మనుష్య కుమారుని అప్పగించుచున్నావా అని వానితో" అని (లూకా 22:48). "చెలికాడా,[27] నీవు చేయవచ్చినది చేయుమని అతనితో" చెప్పారు (మత్తయి 26:50ఎ).

యూదా క్రీస్తువారి సమీపానికి చేరుకున్నప్పుడు జనులు భయపడియుండవచ్చు: ఆ అద్భుతములు చేయువాడు ఏమి చేస్తాడోయని? యూదాకు ఏ కీడును వాటిల్లకపోవడం వారు చూచినప్పుడు, వారి నమ్మిక తిరిగి వారికి వచ్చినట్టుంది. వారు ముందుకు వెళ్లి "ఆయనను పట్టుకొని, బంధించారు" (మత్తయి 26:50బి; యోహాను18:12).[28] ఆ

క్షణం నుండి ప్రభువు మరణించేవరకు, ఆయన కరములు అరుదుగా విడిపింపబడ్డాయి: ఆయన చేతులు త్రాళ్లతో గాని మేకులతో గాని బిగింపబడి ఉన్నాయి (మార్కు 15:1; యోహాను 18:12; 20:25).

క్రీస్తు శిష్యులు ఆయన కొరకు చనిపోడానికి తాము సిద్ధమన్న మాటను నిలబెట్టు కోవాలనుకున్నారు (మార్కు 14:31). ఇప్పుడు, వారు తమ వాగ్దానాన్ని నెరవేర్చుకోడానికి సిద్ధపడ్డారు (లూకా 22:49). పేతురు తన ఖడ్గము[29] దూసి, "ప్రధానయాజకుని దాసుని,[30] కొట్టి అతని చెవి తెగనరికెను" (యోహాను 18:10). ఆ దాసుని తలకే పేతురు గురిపెట్టియుంటాడు – కాని ఆ మనిషి తల తిప్పియుంటాడు. "కత్తి దూసిన మనిషి మంచి జాలరి యన్నట్టు చూపాడు" అని ఒక వ్యక్తి అన్నాడు.

ప్రభువు వెంటనే పనిలోనికి దిగాలి, లేకుంటే కలహం చెలరేగవచ్చు. పేతురు మరియు యితర శిష్యుల రక్తంతో తోటలోని నేల తడిచిపోయేదే, ఆయన పేతురును "నిలిపేయి, ఈలాటిది ఇక వద్దు" అన్నట్టు పలికారు. "–నీ కత్తి తిరిగి వరలో పెట్టుము; కత్తి పట్టుకొను వారందరు కత్తిచేతనే నశింతురు" అని తెలిపారు (లూకా 22:51ఎ; మత్తయి 26:52). ఆత్మసంబంధమైన యుద్ధాలు భౌతికమైన ఆయుధాలతో చేసేవి కావు (2 కొరింథీ. 10:3, 4; యోహాను 18:36 చూడు). పేతురు భావాలు మంచివే, అయితే "కాని సమయంలో, కాని ఆయుధాన్ని, కాని తలంపుతో కాని ఉద్దేశం కొరకు అతడు ఉపయోగించాడు."[31]

ఆయనకు కాపుదలయే అవసరమైయుంటే, ఈ కత్తులు దూసే మనుష్యుల కంటెను ఎంతో ఎక్కువ శక్తిగల ఆధారాలున్నాయి. "ఈ సమయమున నేను నా తండ్రిని వేడుకొనలేననియు, వేడుకొనిన యెడల ఆయన పండ్రెండు సేనా వ్యూహములకంటె ఎక్కువ మంది దూతలను ఇప్పుడే నాకు పంపుననియు నీవనుకొనుచున్నావా?" అని ప్రభువు పేతురునడిగారు (మత్తయి 26:53). ఒక సేనా వ్యూహంలో ఆరువేలమంది సైనికులుంటారు. పండ్రెండు సేనా వ్యూహము లంటే, 72 వేలమంది దూతలు, దిగివస్తే, తన్ను బంధించడానికి వచ్చిన కొన్ని వందలమందిని పారదోలడం ఎంతో సులభం![32]

క్రీస్తు "పండ్రెండు" అనే సంఖ్యను ఉపయోగించడంలో, ఆయన పదకొండు మంది శిష్యులు: వారిలో ఒక్కొక్కరిని కాపాడడానికి ఒక సేనా వ్యూహము ఉంటుందని ఒక వ్యక్తి ఆలోచన చెప్పాడు. ఆ సంఖ్య గొప్ప బలాన్ని చిత్రించడానికి ఉపయోగింప బడియుండవచ్చు. తన ప్రాణాన్ని తీయడానికి ఏ నరుడో, నర సంబంధమైన ఏ సైన్యమో మరి యింకా ఏదో చాలదు. ఆయన దానిని తన స్వంత యిష్టాన్ని బట్టి మాత్రమే అప్పగించుకొంటారు అనేది తన అపొస్తలులకు తేటపరచబడింది (యోహాను 10:17,18; గలతీ. 2:20 చూడు).[33]

పేతురును అలా మందలించిన మీదట, బంధింపబడిన తన చేతులు చూచి,[34] గాయపడిన [తెగిపోయిన] సేవకుని చెవిని ముట్టి, "అతని స్వస్థపరచారు"[35] (లూకా 22:51బి). ఆయన క్రియ భయంకరంగా తిరుగబడే పరిస్థితిని సద్దణగ జేసింది. ఆయన మరణానికి ముందు యిది ప్రభువుయొక్క స్వస్థపరచిన చివరి అద్భుతమైయుంది.

తను పట్టుకొన వచ్చినవారివైపు క్రీస్తు తిరిగి, "–మీరు బందిపోటు దొంగమీదికి

వచ్చినట్టు కత్తులతోను గుదియలతోను బయలుదేరి వచ్చితిరా? నేను అనుదినము మీచెంత దేవాలయములో ఉన్నప్పుడు మీరు నన్ను పట్టుకొనలేదు: అయితే, ఇది మీ గడియయు అంధకారసంబంధమైన అధికారమును అనెను" (లూకా 22:52, 53). ఈ ప్రతిపాదనలో చివరి మాటల భావమేమంటే – "ఇది మీ విజయపు గడియ, అంధకారసంబంధమైన అధికారము కలిగినట్టు కన్పించే సమయం"[36] "అంధకారము ఏలుబడి చేయునప్పుడు, ఇది మీ గడియ" అని NIV అంటుంది.

ఈ సమయానికి, భౌతికమైన యుద్ధం ఏమి జరుగబోయేది లేదన్న సంగతి ప్రభువుయొక్క శిష్యులకు విదితమైయుండాలి. ఓడింపబడి లేక ఆటంకపరచబడి, కలతపరచబడి, దిగ్భ్రమ చెందినవారై ఆయన ముందుగా తెలియజేసినట్టే, క్రీస్తును విడిచి వారు పారిపోయారు (మత్తయి 26:56; 31వ వచనం చూడు). తరువాత పేతురు యోహానులు "దూరంనుండి" ప్రభువును బంధించి తోడుకొని పోయేవారి వెంటబడ్డారు (మత్తయి 26:58; మార్కు 14:54; లూకా 22:54; యోహాను 18:15 చూడు); అయితే, ఏ కోణంలో నుండి చూచినా క్రీస్తు ఒంటరిగా విడువబడినట్టున్నారు. (అయినా, నిజంగా ఆయన ఒంటరిగా లేరు; తన్ను పంపిన తండ్రి యింకను ఆయనతో కూడ ఉన్నాడు [యోహాను 16:32].)

ఒక యువకుని గూర్చిన వింతైన సంఘటనను మార్కు రచన మాట్లాడుతుంది. తన దిగంబర శరీరముమీద నారబట్ట వేసికొన్న యొక పడుచువాడు ఆయన వెంట వెళ్లుచుండగా, వారతనిని పట్టుకొనిరి. అతడు నారబట్ట విడిచి, దిగంబరుడై పారిపోయెను (మార్కు 14:51, 52). ఆ యువకుడు మార్కేయని ఎక్కువ మంది రచయితలు అభిప్రాయపడుతున్నారు.[37] తన రచన యొక్క సత్యానికి సాక్ష్యమిచ్చే మార్కు విధానం యిదియైయుండవచ్చు. "నేను అక్కడున్నాను, నాకు తెలుసు" అనే సందేశం యివ్వడం యిందులో మార్కు ఉద్దేశమైయుండవచ్చు. "శిష్యులను తొందరపడి తీర్పుతీర్చకండి, నీవు అక్కడ ఉండియుంటే, నీవును పారిపోయేవాడవే. నేను అలా చేశాను గనుక నాకీవిషయం స్వయంగా తెలుసు"నని చెప్పడం యిక్కడ మార్కు ఉద్దేశమై యుండవచ్చు.

## సాహస వ్యూహముల ఏర్పాటు (మత్తయి 26:57, 59-68; మార్కు 14:53, 55-65; లూకా 22:54, 63-65; యోహాను 18: 12-14, 19-24)

తోటలో క్రీస్తు బంధింపబడింది మధ్యరాత్రి గాని తరువాత గాని అయ్యుంటుంది.[38] చీకటిమయమైన, యెరూషలేము యిరుకు వీధులగుండా బంధింపబడిన రీతినే ఆయన నడిపింపబడ్డారు. "మొదట అన్నయొద్దకు ఆయనను తీసికొని పోయిరి" (యోహాను 18:13ఎ).[39]

ప్రభువైన యేసు మొదట యూదులచేతను, తరువాత రోమీయులచేతను నేర విచారణకు లోబడ్డాడు. ప్రతి విచారణ మూడు దశలుగా జరిగింది. "విచారణ" అని నేను దీన్ని ఎందుకు అంటున్నా, ఎందుకంటె ప్రతి దశలోను కేవలం న్యాయం

తలకిందులైంది. యూదుల "విచారణలో" దోషియా లేక నిర్దోషియా అని తేల్చే ప్రయాస ఎవరూ తీసికోలేదు. యూదుల నాయకులు ముందుగానే ఆయన నేరస్థుడని ఎంచి, మరణదండన విధించారు (యోహాను 11:47-53; మత్తయి 26:4; మార్కు 14:1). క్రీస్తును "విచారణలో" నిలుపుట వారి ఉద్దేశం న్యాయం చేయడానికి కాదు, తమ చర్యలను సమర్థించుకొనడమే - వారు ముందుగా తీర్మానించుకున్న నిర్ణయానికి ఆమోదముద్ర కావాలి (మత్తయి 26:59; మార్కు 14:55 చూడు).

యూదుల "విచారణలో" మొదటి అంచె అన్న చేత పరీక్షింపబడడం.[40] అన్న "ప్రధాన యాజకుడగు కయపకు మామ" (యోహాను 18:13బి). "క్రీ.శ.6-15ల మధ్యకాలంలో అన్న ప్రధానయాజకుడుగా ఉండినవాడే. వలేరియస్ గ్రేటస్ అనే గవర్నరుచేత అతడు పదవీ భ్రష్టుడయ్యాడు."[41] ధర్మశాస్త్రం ప్రకారం, ప్రధానయాజకుని పదవి జీవితకాలం ఉండేది గనుక, అనేకులు అన్ని హక్కు గల ప్రధానయాజకుడుగా భావించారు.[42] మనం ఆలోచించే లేఖనం క్రింద, అన్నయు కయపయు "ప్రధాన యజకులని సూచింపబడ్డారు" (యోహాను 18:13, 19, 22, 24; అపొ. 4:6 చూడు).[43] "అన్నయు, కయపయు ప్రధాన యాజకులుగాను ఉన్న కాలమున" అని లూకా రాశాడు (లూకా 3:2).

తొలిగా అన్నయొద్దకు ప్రభువు ఎందుకు తీసికొని పోబడ్డారో నిశ్చయంగా చెప్పలేం. మాజీ ప్రధానయాజకుని మీద ఉన్న గౌరవం చొప్పున అలాగు చేసారేమో (హేరోదు వలెనే; లూకా 23:8). ఆ ముసలివాడు యేసుని చూడాలనే వాంఛను వ్యక్తపరచాడేమో. లేక రాజకీయాల్లో ఆరితేరినవాడు డొంకతిరుగుడుగా ఆయన మీద కేసు ఏదైనా అంటగడతాడేమోనని అతని యొద్దకు ఆయనను తీసికొనిపోయి ఉండవచ్చు. లేదా, సన్‌హెడ్రిన్ సభవారు కూడేలోపు, అది ప్రయోజనకరమైన కాలంగా గడిపినట్లు ఉంటుందని తలంచి అలా చేసారేమో.[44]

"ఆయన శిష్యులను గూర్చియు ఆయన బోధను గూర్చియు" తేటబడని ప్రశ్నలు అడుగుతూ అన్న ఆరంభించాడు (యోహాను 18:19). "సమాజమందిరములలోను, దేవాలయములోను ఎల్లప్పుడును బోధించితిని," బాహాటముగా లోకము ఎదుట మాటలాడితిని ... అని ఆయన బదులిచ్చారు (యోహాను 18:20).[45] "రహస్యముగా నేనేమియు మాటలాడలేదు, నీవు నన్ను అడుగనేల? నేను వారికేమి బోధించినది విన్నవారిని అడుగుము; ఇదిగో నేను చెప్పినది వీరెరుగుదురని అతనితో అనెను" (యోహాను 18:21).

ఈ సందర్భంలో, "దగ్గర నిలిచియున్న బంట్రోతులలో ఒకడు, 'ప్రధానయాజకునికి ఈలాగు ఉత్తరమిచ్చుచున్నావా అని చెప్పి, యేసును అరచేతితో కొట్టెను'" (యోహాను 18:22). ఆ రోజు క్రీస్తు అనుభవించబోయే భౌతికమైన నిందకు అదే ఆరంభం. "అందుకు యేసు - నేను కాని మాట అడిగినయెడల ఆ కాని మాట ఏదో చెప్పుము; మంచిమాట అడిగిన యెడల నన్నేల కొట్టుచున్నావనెను" (యోహాను 18:23). ప్రభువు చేతితో తన్ను కాపాడుకొనవద్దన్నారు గాని నాలుకతో కాదు అని మార్టిన్ లూథర్ సూచించాడు.[46]

"అంతట అన్న, బంధింపబడియున్నట్టుగానే క్రీస్తును ప్రధాన యాజకుడైన కయప

యొద్దకు పంపెను" (యోహాను 18:24). ఇది యూదుల విచారణలో రెండవ "అంచె."[47] అన్న యిల్లు కయప యింటికి సమీపంగా ఉండే అవకాశముంది.[48] "ప్రజలందరి కొరకు ఒకడు చనిపోవుట ఉపయుక్తమని" యూదులకు ఆలోచన చెప్పినవాడు కయప అని యోహాను ముందుగానే గుర్తించాడు లేక సూచించాడు (యోహాను 18:14; 11:49-52లను చూడు).

కయప యింటిలో (లూకా 22:54), మిద్దె మీద (మార్కు 14:66), ప్రధాన యాజకులు పెద్దలు శాస్త్రులు (మహాసభవారు) "అందరును అతనితోకూడ వచ్చిరి" (మార్కు 14:53). యేసును సంహరించడానికి తగిన హేతువేదైనను కనుగొనునట్లు, సన్‌హెడ్రిన్‌లోని కనీసపు సంఖ్య కూడి ఉండవచ్చు.[49]

"తన మూడున్నర సంవత్సరాల బహిరంగ జీవితంలో, పరపక్ష ద్వేషమనేవారి భూతద్దముతో ఒక చిన్న లోపం కొరకు క్రీస్తు శత్రువులు పరిశోధించారు; అయినను ఆయనలో వారు ఏ దోషమును కానలేకపోయారు."[50] గనుక యిప్పుడు వారు "-ఆయనకు విరోధముగా అబద్ధసాక్ష్యము వెదకుచుండిరి, కాని అబద్ధ సాక్షులనేకులు వచ్చినను సాక్ష్యమేమియు దొరకలేదు" (మత్తయి 26:59, 60ఎ; నిర్గమ. 20:16 చూడు). వారు చెప్పే కథలు ఏకీభవించే కనీసం యిద్దరు సాక్షులనైనా కనుగొనాలి; అది వారి సమస్య (ద్వితీయో. 17:6; 19:15), కనీసం ఆ అబద్ధ సాక్ష్యమైనా కుదురుగా ఉండలేదు. "వారి సాక్ష్యములు ఒకదానికి ఒకటి సరిపడలేదు" (మార్కు 14:56).

"తుదకు, ఇద్దరు మనుష్యులు వచ్చి - వీడు దేవాలయమును పడగొట్టి, మూడు దినములలో దానిని కట్టగలనని చెప్పెననిరి" (మత్తయి 26:60బి, 61). కొద్ది సంవత్సరాలకు ముందుగా, సూచక క్రియ చేయుమని అడిగిన యూదుల మనవికి బదులుగా, "-ఈ దేవాలయమును పడగొట్టుడి, మూడు దినములలో దాని లేపుదునని వారితో చెప్పెను ... అయితే ఆయన తన శరీరమను దేవాలయమును గూర్చి యీ మాట చెప్పెను" (యోహాను 2:19, 21). అంతేగాని ఆయన దేవాలయాన్ని పడగొట్టుతానని చెప్పియుండలేదు. ఆ యిద్దరు మనుష్యులు అబద్ధమాడారు - కాని వారి అబద్ధ సాక్ష్యం కూడ పొసగలేదు. (మార్కు 14:59).[51]

కయప బహు ఎక్కువగా కలత చెందినట్టున్నాడు. ఆ స్థితిలో కయప ఆయనవైపు తిరిగి, "-నీవు ఉత్తరమేమియు చెప్పవా? వీరు నీ మీద పలుకుతున్న సాక్ష్యమేమని అడుగగా" (మత్తయి 26:62). క్రీస్తు బదులు చెప్పక మౌనముగా ఉండిపోయారు (మత్తయి 26:63ఎ; యెషయా 53:7; అపొ. 8:32, 35; 1 పేతురు 2:23లను చూడు).

ఎటూతోచని పరిస్థితిలో, "-నీవు దేవుని కుమారుడవైన క్రీస్తువైతే ఆ మాట మాతో చెప్పుమని జీవముగల దేవుని తోడని ఆనబెట్టుచున్నాననెను" (మత్తయి 26:63బి). "జీవముగల దేవునితోడని ఆనబెట్టుచున్నా"ననేది - ఒక వ్యక్తిని ప్రమాణం చేయించే యూదుల ప్రమాణం.[52] "ఒట్టుకింద నీకాజ్ఞాపించుచున్నానని" NIV అంది.

క్రీస్తు జవాబు చెప్పుతారనే నిరీక్షణ కయపకు లేకపోయి ఉండవచ్చు. ఆ సమాజంలో, నేడు అనేకుల మధ్య ఉన్నట్టు, నేరం మోపబడినవాడు తనకు వ్యతిరేకంగా తానే సాక్ష్యం చెప్పుకొనేలా బలవంతం పెట్టబడదు. యూదుల నాయకుల ప్రశ్నలకు ముందుగా క్రీస్తు

బదులివ్వలేదు గనుక, ఆయన మౌనంగా ఉండడం ప్రయోజనకరమైనదని తలంచితే, యిక్కడ మౌనంగా ఉండడం మంచిది. ఆయన మాటలాడడానికి యిష్టపడనట్టయితే, ప్రధానయాజకునికి ఆయన మీద పెట్టే కేసు ఏదీ ఉండదు. మహా విపత్కరమైన క్షణాల్లో, ప్రభువు మాట్లాడారు. "అవును నేనే" అని ఆయన బదులిచ్చారు (మార్కు 14:62ఎ).[53]

అంతేకాదు, "మనుష్యకుమారుడు సర్వశక్తిమంతుని కుడిపార్శ్వమున కూర్చుండుటయు, ఆకాశ మేఘారూఢుడై వచ్చుటయు మీరు చూచెదరు" అని చెప్పెను (మత్తయి 26:64బి; దానియేలు 7:13; కీర్తన. 110:1 చూడు). ఆ సమయములో, క్రీస్తు అవమానపరచబడుతున్నారు, కాని యింకా కొద్దికాలంలోనే ఆయన తన తండ్రి కుడిపార్శ్వమునకు హెచ్చింపబడబోతున్నారు. అప్పుడు, కయప కాదు, ఆయనే అధికారపు స్థితిలో ఉండబోతారు!

క్రీస్తు జవాబుకు కయప ఉప్పొంగి పోయి ఉండవలసింది, కాని షాక్ తిన్నట్టు గొప్ప ఫోజు యిచ్చాడు. అతడు తన వస్త్రాన్ని చించుకున్నాడు–గొప్ప విచారమునకు అది గురుతు[54]–మరియు అతడిలా అన్నాడు, "వీడు దేవదూషణ చేసెను! మనకిక సాక్షులతో పని ఏమి?" (మత్తయి 26:65ఎ). మోషే ధర్మశాస్త్రము ప్రకారం, దేవుని నామమును దూషించినవాడు చంపబడాలి (లేవీ. 24:16). యూదుల ధర్మశాస్త్రం ప్రకారము, దేవదూషణ చేసిన దోషికాదు,[55] అయితే చట్టబద్ధమైన నిర్వచనాలయందు కయపకు అక్కరలేదు. "యేసు దేవుని కుమారుడైన" క్రీస్తునని ఒప్పుకున్నాడు (ఆలాగు ఆయన తన్ను దేవునితో సమానునిగా చేసికొన్నాడు; యోహాను 5:18 చూడు). అంతేగాక, "మనుష్యకుమారు"డనే మెస్సీయ పదాన్ని తనకు వర్తింపజేసికొన్నారు. గనుక ఆయన "దేవదూషణ" చేసియున్నాడని యాజకుడు బిగ్గరగా అరిచాడు.

"ఇదిగో ఈ దూషణ మీరిప్పుడు వినుచున్నారు; మీకేమి తోచుచున్నది? అని కయప సభవారిని అడిగాడు." (మత్తయి 26:65బి, 66ఎ). "వీడు మరణమునకే పాత్రుడని" వారు బదులిచ్చారు (మత్తయి 26:66బి). ఇది సన్‌హెడ్రిన్ యొక్క వ్యవహారిక ప్రతిపాదన కాదు; అది సూర్యోదయమైన కొంతసేపటికి గాని రాదు (లూకా 22:66–23:1 చూడు). అయితే మరణదండనను సమర్థించడానికి వారు ఒక మార్గాన్ని కనుగొన్నామని సంతృప్తి చెందారు.

వారు తమ ఉద్దేశాన్ని సాధించిన మీదట, సభవారు అణగియుండిన తమ ద్వేషాన్ని విడుదల చేసికొనుటకు గాను, కొందరు ఆయనకు ముసుగువేశారు (మార్కు 14:65; లూకా 22:64 చూడు). అప్పుడు కొందరాయన "ముఖము మీద ఉమ్మివేసిరి, కొందరు గుద్దిరి, కొందరు ఆయనను అరచేతులతో కొట్టి – క్రీస్తూ, నిన్ను కొట్టినవాడెవడో ప్రవచింపుమనిరి" (మత్తయి 26:67, 68).[56] "బంట్రోతులును ఆయనను అరచేతులతో కొట్టి పట్టుకొనిరి" (మార్కు 14:65; లూకా 22:63, 64).[57] "ఆయనకు విరోధముగా ఇంకను అనేక దూషణ వచనములాడిరి" (లూకా 22:65). ఈ విధంగా, క్రీస్తు విరోధులు తెల్లవారువరకు తమ కాలాన్ని గడిపారు.

## ముగింపు

దీర్ఘమైన రాత్రి, చివరికి ముగియవచ్చింది, అయితే దీర్ఘమైన పగలు యింకను ముందు ఉంది. అనేకమైన అన్యాయాలను, గాయాలను యింకను సహింపవలసి ఉంది. పేతురు ఎరుగననుటతో మన తరువాత పాఠం ఆరంభమౌతుంది. తరువాత ప్రభువు ఎదుర్కోనబోయే "నేరవిచారణలను" తిరిగి చూద్దాం.

## నోట్సు

"నిద్రలేని రాత్రి" అని దీనికి మరో పేరు పెట్టవచ్చు, ఈ లేఖన భాగానికి సంబంధించి క్రింద కొన్ని పాయింట్లను అనుసరించవచ్చు.

**యేసును అప్పగించినవాడు**

యూదా మీద శీలానికి సంబంధించిన ప్రసంగం చేయవచ్చు.

**తోటలో క్రీస్తు గడియలు**

గెత్సేమనే మీద ప్రసంగం. "ఏకాంతము" అనే దానిమీద ప్రసంగం, ప్రభువు మరణం సమీపిస్తుండగా తన శిష్యుల తోడును ఆయన కోరిన విషయంపై "నీ చిత్తము సిద్ధించునుగాక" అనే ప్రసంగం సహాయపడుతుంది.

**క్రీస్తు యొక్క చివరి స్వస్థత అద్భుతం.**

మల్కు చెవిని అతికించడం రక్షణ షరత్తులకు సంబంధించి.

**క్రీస్తు పై నేరవిమర్శలు**

"క్రీస్తు పై నేరవిమర్శలు" అనే ప్రసంగం ఈ వాక్య భాగంనుండి చేయవచ్చు."నీ అభిప్రాయమేమి?" అనే పాఠం చూడు.

---

సూచనలు

[1]యోహాను 15–17లలోని విషయాలు మేడగదినుండి గెత్సేమనేకు ప్రయాణ సమయములోని దృశ్యంవలన ప్రేరేపితమైనవని అంటారు ("క్రీస్తు జీవితం, 6"ను చూడు). అలా ఉన్నా, యోహాను 15–17లోని మాటలు కెద్రోను వాగు దాటక మునుపే, పట్టణంలో ఉన్నప్పుడు పలికినవే (యోహాను 18:1). [2]మార్కు 14:26–32 ప్రకారం, మేడగదిని వదలిన దగ్గర నుండి గెత్సేమనే చేరేవరకు మధ్యలో యేసు కొన్ని మాటలు మాట్లాడారు. ఆయన యింకా ఏ యితరమైన మాటలు పలికినట్లు మనకు తెలియదు. [3]"ప్రసంగ శాస్త్రం." ప్రసంగాన్ని సిద్ధపరచుకొని ప్రసంగించడమును తెలుపుతుంది. [4]"స్తుతి" అనే మాటకు హెబ్రీ పదరూపము "Hallel" అనేది. [5]Jack P. Lewis, *The Gospel According to Matthew, Part 2,* The Living Word Commentary Series, ed. Everett Ferguson (Abilene, Tex.: ACU Press, 1976), 148. [6]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or A Harmony of the Four Gospels* (Cincinnati: Standard Publishing Co., 1914), 685. [7]కెద్రోను వాగు యెరూషలేము తూర్పు ప్రాకారానికి సమాంతరంగా పారుతుంది. పటాన్ని చూడు. [8]"తోటలో" అనే పాఠం చూడు. [9]H. I. Hester, *The Heart of the New Testament* (Liberty, Mo.: Quality Press, 1963). 199. ఒలీవ

చెట్లు యేసు ప్రార్థించిన దినాలలోనివే అంటారు. అయితే చరిత్రకారులు ఆ ఒలీవ చెట్లు రోమీయులు యెరూషలేము నాశనము చేయునప్పుడు వాటిని నాశనం చేసిరని అంటారు. [10]"ఆయన రాతివేత దూరమంత వెళ్లి" (లూకా 22:41ఎ) J. W. McGarvey 150 నుండి 200 అడుగుల దూరముంటుందని అంచనా వేశాడు (McGarvey and Pendleton 686).

[11]పెద్ద బండవద్ద ఆయన మోకరించారనేది దైవప్రేరేపితం కాని ప్రాచీన పారంపర్యం. లేఖనం ప్రకారమైతే ప్రభువు (సాష్టాంగ పడినట్టుంది) సాగిలపడి. [12]"పాత్ర" పై వివరణకు "క్రీస్తు జీవితం, 5"ను చూడు. [13]క్రీస్తు ప్రశ్న గుప్తం చేయబడింది. [14]A common symptom of depression is the desire to sleep all the time. [15]ప్రభువు జీవితంలో దేవదూతలు కన్పిస్తారు. ఉదాహరణకు ఆయన జనన సమయంలో స్తుతిపాడారు (లూకా 2:13, 14), శోధన తరువాత పరిచర్య చేశారు (మత్తయి 4:11). తరువాత, ఆయన పునరుత్థానాన్ని గూర్చి తెలిపారు (మత్తయి 28:2, 5, 6). [16]"ఇప్పటివరకు నేను అక్కర కలిగియున్నాను. ఇప్పుడు ఎదురించి విశ్రాంతి తీసికోవచ్చు, నాకు సహాయముగాను ఆదరణగాను ఉండే అవసరం తీరిపోయింది" (McGarvey and Pendleton 688). [17]"గడియ" అనేది ఆయన మరణ సమయం. ఈ గడియకు ముందుకు ఆయన నడుస్తూ వెళ్లుతున్నారు (యోహాను 2:4; 7:30; 8:20; 12:23, 27; 13:1; 17:1). [18]క్రీస్తును బంధించిన విషయాన్ని పలురకాల వరుస క్రమములు వ్రాయవచ్చు. అందులో ఒక పద్ధతిని ఇక్కడ ఉపయోగించాం. [19]మార్కు 14:51, 52 మీద కామెంట్లను చూడు. [20]సన్హెడ్రిన్ నుండి ప్రతినిధులు అక్కడ ఉన్నట్టున్నారు (లూకా 22:52). వారు పరిసయ్యులకు చెందినవారైనట్టు యోహాను గుర్తిస్తున్నాడు (యోహాను 18:3; అపొ. 23:1, 6 కూడ చూడు).

[21]పాతనిబంధన ప్రకారం, ఈ బాధ్యతలను లేవీలు చేపట్టాలి. మీరు లేవీలు కావచ్చు కాకపోవచ్చు. [22]సంఘర్షణకు సంబంధించిన పరిస్థితులను చెదరగొట్టడానికి సైనికులు యెరూషలేములో ఉంటారు. ప్రధాన యాజకులు రోమా అధికారులకు ఈ విషయమై వ్యతిరేకంగా చెప్పియుండవచ్చు. [23]యోహాను 18:12లో "సైనికులు" అని ఉంది. వీరు అంతోనియకోటలో ఉంటారు. ("క్రీస్తు జీవితం, 1"లోని పటమును చూడు). [24]వారు దివిటీలను కూడా తెచ్చారు (యోహాను 18:3). పస్కా పున్నమినాడు వస్తుంది. క్రీస్తు పారిపోతుంటే చెట్ల మధ్యను వెదకడానికి వీరు దివిటీలు పట్టుకొచ్చారేమో. [25]దేవాలయంలో నుండి రూకలు మార్చువారిని తోలివేయడంలో క్రీస్తుకు దైవికమైన ప్రసన్నత సహాయపడిందేమో (మార్కు 11:15; యోహాను 2:15). [26]G. Hall Todd, *The Gamblers at Golgotha* (Grand Rapids, Mich.: Baker Book House, 1958), 39. [27]యూదా తనకు "స్నేహితుడై" యుండాలని ప్రభువు వాంచించారు. అయితే యూదా ఆయన స్నేహాన్ని తృణీకరించాడు. [28]యేసును బంధించడంలో దేవాలయం అధికారులతో రోమా సైనికులు సహకరించారు (యోహాను 18:12). అయితే వారు ఎంత కాలం అక్కడ కొనసాగారో చెప్పలేం. వారి పని ముగిసిందంటే, క్రీస్తును యూదుల స్వాధీనంచేసి వారు వెళ్లియుండ వచ్చు (అపొ. 22:30 చూడు). [29]రెండు కత్తులున్నాయని ముందుగా ఆ అపొస్తలుడు తెలిపాడు (లూకా 22:38). కనీసం వాటిలో ఒకటి తోటలోనికి తేబడియుండవచ్చు. [30]ప్రధాన యాజకుని యింటితో యోహానుకు పరిచయం ఉన్నందున, ఆ బానిస పేరు మల్కు అని గుర్తు పెట్టుకున్నాడు (యోహాను 18:15, 16).

[31]Warren W. Wiersbe, *The Bible Exposition Commentary,* vol.1 (Wheaton, Ill.: Victor Books, 1989), 162. [32]వాస్తవానికి ఒక్క దూతయే సరిపోయి ఉంటాడు. [33]తన మరణము లేఖనములను నెరవేర్చుతుందని ప్రభువు తిరిగి నొక్కి పలికారు (మత్తయి 26:54, 56). [34]ఈ కార్యము ప్రభువు కరములు బంధించకముందు జరిగియుండవచ్చు. [35]ఈ స్వస్థతను గూర్చిన వివరాలు మనకు యివ్వబడలేదు. [36]అది కొద్దికాలం నిలిచిన విజయమే – క్రీస్తు పునరుత్థానంతో అది మంట కలిసి పోయింది. [37]కొన్ని సార్లు రచనలో యోహాను ప్రథమ పురుషలో సూచించుకుంటాడు. మార్కు కూడా అదే చేసి యుండవచ్చు. మార్కు నివాసం యెరూషలేములోనిదే (అపొ. 12:12, 25). ఈ యువకుడు మేడగదిలోనుండి ప్రభువును ఆయన అపొస్తలులును వెళ్లుతుండగా వెంట పోయాడా వేరొక విధంగా తోటలోనికి వచ్చాడా తెలియదు. తాను యేసు యొక్క శిష్యుడనని ఆ యువకుడు ఏదో విధంగా కనపరచాడు గనుక ఆ గుంపు అతనిని "పట్టుకోవాలనుకున్నారు" (మార్కు 14:51). [38]పస్కా భోజనం సూర్యాస్తమయానికి తరువాత (సాయంకాలం 6 గం.ల ప్రాంతంలో) దీర్ఘమైన చర్చలు వగైరాలలో అది దీర్ఘంగా కొనసాగినట్టుంది (యోహాను 14–17). [39]అన్న ఎదుట ప్రభువు నిలిచిన సంగతి యోహాను మాత్రమే తెలుపుతున్నాడు. [40]"నీ అభిప్రాయమేమి?" అనే దానిలో "క్రీస్తు నేర విమర్శను" గూర్చిన చర్చలో కొన్ని సంగతులు చుద్దాం.

[41]F. LaGard Smith, *The Narrated Bible in Chronological Order* (Eugene, Oreg.: Harvest House Publishers, 1984), 1467. [42]అన్న గూర్చి "క్రీస్తు జీవితం, 1"లో చూడు. [43]"రాష్ట్రపతి" వంటి గౌరవపదమైన బిరుదులు అతడు ఆ పదవినుండి విరమించిన పిదప కూడ తరచుగా వినియోగిస్తాం. అలాటిదే యిది.

[44]ప్రభువు బంధింపబడిన స్థలంలో సన్‌హెడ్రిన్ ప్రతినిధులు సహితము ఉండి యుండవచ్చు (లూకా 22:52). అయితే బంధింపబడిన మీదట కొందరిని సంధింపవలసివచ్చియుంటుంది. [45]"రహస్యంగా ఏమి మాట్లాడలేదంటే," తన అపొస్తలులకు ఒంటరిగా ఏమి బోధించలేదని దాని అర్థం కాదు (మార్కు 4:34; లూకా 10:23). రహస్యంగా ఉంచవలసిందేది బోధించలేదు అని దాని భావం (మత్తయి 10:27). [46]McGarvey and Pendleton, 695 లూథర్ మనస్సులో మత్తయి 5:39లోని బోధ ఉన్నట్లు ఉంది. [47]ప్రభువు కయప ఎదుట ఉన్నదానితో పేతురు ఆయనను ఎరుగనన్నది కలిసిపోతుంది. అయితే ఈ రెండింటిని విడదీసి ముందు ప్రభువును గూర్చి ఆ తరువాత పేతురును గూర్చి తరువాత పాఠంలో చూద్దాం. [48]అన్న, కయప యిండ్లు ఒకే కాంపౌండులో ఉన్నట్టు కొందరు భావిస్తారు. అవి ఒకదాని కొకటి కొంత దూరంలో ఉన్నట్టు యిటీవల త్రవ్వకాలు సూచించాయి. [49]Robert L. Thomas, ed. and Stanley N. Gundry, associated., *A Harmony of the Gospels* (Chicago: Moody Press, 1978), 329. ఇది న్యాయమైన సమావేశం కాదు ("నీ తీర్మానమేమి?" అనే పాఠమును చూడు). క్రీస్తు పక్షాన (నీకొదేము, అరమత్తయ యోసేపు [యోహాను 7:50; లూకా 23:50, 51]) ఉన్నవారిని మహా సభకు ఆహ్వానించియుండరు. [50]Richard Rogers, *The Life of Christ and His Teaching* (Lubbock, Tex.: Sunset International Bible Institute External Studies Department, 1995), 95.

[51]క్రీస్తు తన శరీరాన్ని గూర్చి మాట్లాడుతున్నట్టు మహాసభలోని కొందరికి అర్థం అయ్యుండవచ్చు (మత్తయి 27:63 చూడు). ఏ కారణాన్ని బట్టియోకాని, న్యాయ విచారణ ఆ విషయాన్ని గూర్చి కొనసాగలేదు … (అపొ. 6:13, 14 చూడు) లోని మహాసభవారి చర్చతో పోల్చి చూడు. [52]కయప ఒట్టుపెట్టుకున్నాడు (మత్తయి 5:34లో సామాజికమైన వాటిని చేర్చలేదు). [53]"నీవు అన్నట్టే" అని ప్రభువు జవాబిచ్చినట్టు మత్తయి దాఖలు చేశాడు (మత్తయి 26:64) దీనికి "అవును" అని అర్థం – యూదులు వెదుకుతున్న మెస్సీయ తానేయని ప్రభువు గతంలో బహిరంగంగా చెప్పుకున్నారు (యోహాను 5:17, 18; 10:30–39; మత్తయి 22:41–46 చూడు). [54]అపొ. 14:14 మీద కామెంట్స్‌ను "కార్యగ్రంథం, 3"లో చూడు. [55]ఈ చర్చను "నీ అభిప్రాయమేమి?" అనే పాఠంలో చూడు. [56]కండ్లకు గంతకట్టే ఆట మన పిల్లలు ఆడేదే. కొట్టి – కొట్టినవానిని పట్టుకో, ముట్టుకో అంటూ. [57]సభవారు ప్రభువును నిందించినట్టు మత్తయి అంటుంది, అధికారులు అ పని చేసినట్టు లూకా సూచిస్తున్నట్టు కన్పిస్తుంది. ఈ రెండు గుంపులు ప్రభువును అవమానపరచినట్టు మార్కు అంటుంది (యోహాను 18:6 చూడు) సభవారు స్తెఫనును ఎలా ట్రీట్ చేశారో చూడు (అపొ. 7:54, 57).

---

## యేసు బంధింపబడుటపై ఆలోచనలు

"తాను ప్రార్థించవలసిన సమయంలో పేతురు నిద్రపోతున్నాడు, తాను ఆలకించ వలసిన సమయంలో మాట్లాడుతున్నాడు, భయపడవలసినప్పుడు అతడు డాంబికం ప్రదర్శిస్తున్నాడు. ఇప్పుడు లోబరచుకొనవలసిన సమయంలో పోరాడుతున్నాడు!"

*The Bible Exposition Commentary*, vol, 1,
Warren W. Wiersbe

పేతురువలె, ఆత్మ సంబంధమైన యుద్ధాలను భౌతికమైన ఆయుధములతో పోరాడ ప్రయత్నిస్తాం. వాక్యం యొక్క శక్తిమీద ఆధారపడే దానికి బదులు (రోమా. 1:16; హెబ్రీ. 4:12; ఎఫెసీ. 6:17), మన విశ్వాసాన్ని భవన కట్టడములు కార్యక్రమముల ప్రణాళిక, శక్తివంతమైన నాయకత్వంపైన నిలుపుతాం. "మన యుద్ధోపకరణములు శరీర సంబంధమైనవి కావు" అన్న వాస్తవాన్ని సంపూర్ణంగా అంగీకరించడం క్లిష్టమైన విషయం (2 కొరింథీ. 10:4).

David Roper